బ్రోచర్ల ఆవిష్కరణ

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఖలీల్‌వాడి, మార్చి 31 : నగరంలోని ఆర్యవైశ్య సంఘంలో ఆర్యవైశ్య గ్రాడ్యుయేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న నిర్వహించే దిక్సూచి -2 కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆదివారం ఆవిష్కరించారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్యా అవకాశాలు , ప్రణాళిక ప్రకారం ఎంచుకున్న లక్ష్యాలను ఎలా చేరుకోవాలి, నూతన టెక్నాలజీ, పిల్లలను తమ లక్ష్యాన్ని చేరడంతో తల్లిదండ్రుల సహకారం తదితర అంశాలపై నిపుణులు వివరిస్తారని ఆర్యవైశ్య గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కుకూట్ల నవీన్, సభ్యులు తెలిపారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

రాజేశ్వర్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

ఖలీల్‌వాడి, మార్చి 31 : తమ స్నేహితుడు రాజేశ్వర్ అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో సీఎస్ఐ పాఠశాల 1995-96 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. రాజేశ్వర్‌కు రూ.26 వేల నగదును అందజేయంతో మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాలం రాజు, చందు, ప్రసన్న, చంద్రశేఖర్, శ్యాంసన్, మారుతి, వెంకట్, సాయి పాల్గొన్నారు.

ప్రభుత్వ బోధన వైద్యుల సంఘం ఎన్నిక

ఖలీల్‌వాడి, మార్చి 31 : నిజామాబాద్ ప్రభుత్వ బోధన వైద్యుల సంఘం నూతన కార్యవర్గాన్ని రిటర్నింగ్ ఆఫీసర్ డాక్టర్ కిశోర్, డాక్టర్ జలగం తిరుపతిరావు, డాక్టర్ నాగమోహన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ గోపాల్ సింగ్, ఉపాధ్యక్షులుగా డాక్టర్లు మురళీకృష్ణ, డాక్టర్ స్వాతి, డాక్టర్ సుభాష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కిరణ్ మాదల, కోశాధికారిగా డాక్టర్ దినేశ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా డాక్లర్లు శ్రీనివాస్, రాజేందర్ సూరినీడు, డాక్టర్ సంజీవ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా వైద్యులు హరీశ్‌స్వామి, సునీల్ కుమార్, రోహిణి, నాగేశ్వర్‌రావు, రాజశేఖర్, సంతోష్‌ను ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖలీల్‌వాడి, మార్చి 31 : నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు (సోమవారం) ఉదయం 8 నుంచి 11 గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ తోట రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్ -2 ఫీడర్ మరమ్మతుల కారణంగా న్యాల్‌కల్ చౌరస్తా, సూర్యనగర్, చంద్రనగర్, కోటగల్లీ, హనుమాన్‌నగర్, పద్మనగర్ రోడ్ నంబర్ 1, 2, 3, 4, యాదగిరిభాగ్, వినాయక్‌నగర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నవీపేట సంతల వేలంపై కలెక్టర్‌దే తుది నిర్ణయం

నవీపేట, మార్చి 31: మండల కేంద్రంలో మేకలు, వార సంతల వేలంపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తుది నిర్ణయం తీసుకుంటారని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) తరుణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేకల సంతకు గతేడాది రూ. 56.16 లక్షల వేలం పలకగా ఈ ఎడాది రూ.40.35 లక్షల వద్ద పాట ఆగిపోయింది. గతేడాది కన్నా తక్కువ ధర పలకడంతో నవీపేట జీపీ అధికారులు వేలం వేయిదా వేశారు. ఇలా మూడుసార్లు వేలం నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. సంతల వేలంపై నిర్ణయం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు డీపీవో చెప్పారు. ఈ ప్రతిపాదనల ఫైలు కలెక్టర్ వద్ద ఉందని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిర్ణయం తీసుకునే అవకాశం లేదని అన్నారు. గత టెండర్ల ప్రక్రియ మార్చి 31తో ముగిసిందని చెప్పారు. కలెక్టర్ నుంచి నిర్ణయం వచ్చే వరకు పాత కంట్రాక్టర్లకుగానీ, జీపీ సిబ్బందికి గానీ అప్పజెప్పే అవకాశం ఉందని డీపీవో పేర్కొన్నారు.

ఆర్టీసీ ద్వారా భద్రాద్రి రాములవారి కల్యాణ తలంబ్రాలు

శక్కర్‌నగర్, మార్చి 31: ఆర్టీసీ ద్వారా భద్రాచల శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవ ముత్యాల తలంబ్రాలను భక్తులకు అందించేందుకు చర్యలు చేపట్టామని ఆర్టీసీ బోధన్ డీఎం శ్రీనివాస్, కార్గో ఇన్‌చార్జీలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తలంబ్రాలు కావాలనుకునే వారు బోధన్‌లోని కార్గో కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో రూ.151 చెల్లించాలని, కల్యాణం అనంతరం తలంబ్రాలను నేరుగా ఇంటికి గానీ ఆయా సమీప కార్గో కేంద్రాల ప్రతినిధుల ద్వారా గానీ భక్తులకు అందజేస్తామని వెల్లడించారు. ఈనెల 17వ తేదీ వరకు భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉద్మీర్‌గల్లీలో ఆటో దగ్ధం

శక్కర్‌నగర్, మార్చి 31: బోధన్ పట్టణంలోని ఉద్మీర్‌గల్లీలో సాయిలు అనే వ్యక్తికి చెందిన ఆటో మార్చి 30వ తేదీ అర్ధరాత్రి కాలిపోయింది. రాత్రి సమయంలో ఆటోను పార్క్ చేసి యజమాని నిద్రించగా, ఎదురింటి వారు కాలిన వాసన రావడం గుర్తించి ఆటో యజమానికి సమాచారం అందించి మంటలను ఆర్పారు. బాధితుడు మాత్రం ఆటోను ఉద్దేశపూర్వకంగానే తగులబెట్టి ఉంటాడని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సాయిలు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు.

దొంగ మృతికి కారణమైన పలువురిపై కేసు నమోదు

నవీపేట,మార్చి 31: పాల్దా గ్రామ శివారులో శ్రీ వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీ (మూతబడిన రైస్‌మిల్లు)లో చోరీకి పాల్పడిన బానోత్ సునీల్‌ను కర్రలతో కొట్టి నిందితుడి మృతికి కారణమైన పాల్దా గ్రామానికి చెందిన లచ్చన్నతోపాటు ఎనిమిది మంది గ్రామస్తులపై కేసు నమోదు చేసినట్లు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్ ఆదివారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సునీల్ కొన్నేండ్ల క్రితం మాక్లూర్ మండలం దుర్గానగర్ తండాకు చెందిన అమ్మాయిని పెండ్లి చేసుకున్నాడు. కొన్ని రోజుల క్రితం భార్య మృతి చెందడంతో ఆర్మూర్‌లో నివాసం ఉంటున్నాడు. పాత సామగ్రి ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చెడు వ్యసనాలకు బానిసైన సునీల్ మద్యం సేవించే చోట నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారం ప్రాంతానికి చెందిన ఐదుగురు నేరస్తులతో పరిచయం ఏర్పడింది. వారితో కలిసి సునీల్ నేరాలకు పాల్పడుతూ వస్తున్నాడు. ఈనెల 30న పాల్దా రైస్‌మిల్‌లో మిషనరీ సామగ్రిని చోరీ చేసి ఆటోలో వేసుకొని పారిపోతుండగా సునీల్ గ్రామస్తులకు చిక్కాడు. మిగిలిన వారు పారిపోయారు. సునీల్‌ను గ్రామస్తులు పట్టుకొని కర్రలతో దాడి చేయడంతో మృతి చెందాడు. సునీల్ మృతికి కారణమైన పాల్దా గ్రామానికి చెందిన పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. రైస్‌మిల్‌లో చోరీకి పాల్పడి పారిపోయిన నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా ఈస్టర్ సండే

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఈస్టర్ సండే విశిష్టతను వివరించిన పాస్టర్లు

వినాయక్‌నగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

బోధన్‌లోని సీఎస్ఐ చర్చిలో శిలువ వెలిగింపు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

డిచ్‌పల్లి/ సారంగపూర్/ సుభాష్‌నగర్/శక్కర్‌నగర్, మార్చి 31 : జిల్లావ్యాప్తంగా ఈస్టర్ సండే వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ఈస్టర్ సండే విశిష్టతను వివరించారు. డిచ్‌పల్లి మండలం నడ్పల్లిలోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ స్టీవెన్ కుమార్ దైవ సందేశం అందించారు. బర్ధిపూర్ గ్రామంలోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో ఇన్‌చార్జి దినాకర్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధానవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. మహిళా అధ్యక్షురాలు ఇందిర ఆధ్వర్యంలో స్త్రీల మైత్రి కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని వినాయక్‌నగర్ బాప్టిస్ట్ చర్చిలో రెవరెండ్ పాస్టర్ దారం అబ్రహాం యేసు ప్రభు పునరుత్థన గురించి వివరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పాస్టర్లు రేచల్, చర్చి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చి, నిర్మల హృదయ్, సుభాష్‌నగర్‌లోని సెయింట్ ఆఫ్ చర్చి, గ్లోరియస్ చర్చి, ఎల్లమ్మగుట్ట, చంద్రశేఖర్ కాలనీ తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బోధన్‌లోని సీఎస్ఐ చర్చిలో తెల్లవారు జామున 4.30 గంటలకు చర్చి ఉమెన్స్ ప్రెసిడెంట్ మున్కాల మృదుశీల ఆధ్వర్యంలో శిలువ వెలిగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. చర్చి ఫాదర్ రెవరెండ్ ప్రభాకర్ ఈస్టర్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో రెవరెండ్ స్టీఫెన్, చర్చి కమిటీ ప్రతినిధులు దమ్ముళ్ల జ్యోతిరాజ్, స్టీవర్డ్, ఎడ్వర్డ్, ఆర్పీ దాస్, సుమన, పుష్పరాజ్, సుదీప్, క్రైస్తవులు పాల్గొన్నారు.

బర్ధిపూర్‌లోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో..

కొనసాగుతున్న ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు

పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

ఖలీల్‌వాడి, మార్చి 31 : మోపాల్ మండలం నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమలలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం దేవనాథ జీయర్ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజదాసు స్వామి ఆధ్వర్యంలో గరుడ ధ్వజారోహణ దేవతా ఆహ్వానం, ప్రత్యేక పూజలు చేసి సంతానార్థులకు గరుడ ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ప్రముఖ నిర్మాత శిరీష్, యజ్ఞాచార్యులు శ్రీకర్, రోహిత్ కుమారాచార్యులు, విజయ్ స్వామి పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ సంఘం సంక్షేమానికి కృషిచేస్తా..

- కేంద్రమాజీ మంత్రి వేణుగోపాలాచారి

శ్రీధరాచారి దంపతులను సన్మానిస్తున్న కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, సంఘం ప్రతినిధులు

సుభాష్‌నగర్/ ఇందల్వాయి, మార్చి 31 : శ్రీవైష్ణవ సంఘం అభివృద్ధి, సంక్షేమానికి కృషిచేస్తానని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి అన్నారు. శ్రీవైష్ణవ సంఘం సర్వసభ్య సమావేశాన్ని గాజులపేట ఎంజీ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిర్మల్, ఆదిలాబాద్, కామారెడ్డి తదితర ప్రాంతాల సంఘ సభ్యులందరూ ఐక్యంగా ఉంటూ సంఘ అభివృద్ధికి కృషిచేయాలని అన్నారు. శ్రీవైష్ణవ సంఘం - ఇందూరు శాఖ రజతోత్సవం వేడుకల్లో భాగంగా ముందస్తు సమావేశాన్ని నిర్వహించినట్లు సభ్యులు తెలిపారు. సంఘానికి విశేష సేవలందించిన ప్రముఖ వేదపండితుడు శ్రీధరాచారి దంపతులతోపాటు వివిధ అవార్డులను పొందిన ఇందల్వాయి రామాలయం ప్రధానాచార్యుడు కందాలై రాజగోపాలచారిని ఘనంగా సన్మానించారు.

లైబ్రరీ అభివృద్ధికి సమష్టిగా కృషిచేద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న గ్రామపెద్దలు

- సాలూరాలో గ్రామపెద్దల తీర్మానం

బోధన్ రూరల్, మార్చి 31: సాలూరా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డాక్టర్ అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం (లైబ్రరీ) అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని గ్రామస్తులు తీర్మానించారు. లైబ్రరీ వద్ద ఆదివారం గ్రామపెద్దలు, విద్యావంతులు, యువకులు సమావేశమయ్యారు. లైబ్రరీకి వచ్చే పాఠకులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేద్దామని తీర్మానించారు. లైబ్రరీ నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు కలుగకుండా శాశ్వత సభ్యత్వం కల్పించి, విరాళాలు సేకరిద్దామని నిర్ణయించారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు గాను లైబ్రరీకి ఓ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పీఆర్టీయూ జిల్లా నాయకుడు ఇత్తెపు శంకర్, నాయకులు బుద్ధె రాజేశ్వర్, సీనియర్ జర్నలిస్టు గడ్డం గంగులు, ఆధ్యాతిక వేత్త సంగమేశ్వర అప్ప, ఇత్తెపు రమేశ్, శివకాంత్ పటేల్, కండెల సంజీవ్, సింగడి పాండు, కేజీ గంగారాం, ప్రజ్ఞశ్రీ విద్యా సంస్థల అధినేత రాజు, రాజ్‌కుమార్ పటేల్, ఎం.గంగారాం, ప్రకాశ్, దత్తురాం, నాగరాజు, రాజా గౌడ్, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

మోర్తాడ్ పెద్దమ్మ ఆలయంలో చోరీ

ఆలయంలో ధ్వంసమైన బీరువా

మోర్తాడ్, మార్చి 31: మండలకేంద్ర శివారులోని వడ్యాట్ రోడ్డు పక్కన ఉన్న పెద్దమ్మ ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారుజామున ఆలయ తాళం పగులగొట్టి, బీరువాను తెరిచి, హుండీని ధ్వంసం చేసి ఆలయానికి సంబంధించిన ఎనిమిది మాసాల బంగారం, సుమారు రూ.10 వేల వరకు నగదును అపహరించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు అటువైపుగా వెళ్లిన వారు ఇద్దరు దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

మోర్తాడ్, మార్చి31: సమాజ సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పెద్దన్న అన్నారు. కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల వేసవికాల శిక్షణా శిబిరం ముగింపు సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. యువత సేవాతత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. వారం రోజులుగా మండల కేంద్రంలో వివిధ కార్యక్రమాలు చేపట్టిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి భూపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్

'నవోదయ' ఫలితాల్లో ఐ5 విద్యార్థుల ప్రతిభ

ఖలీల్‌వాడి, మార్చి 31 : జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశపరీక్ష ఫలితాల్లో జిల్లాకేంద్రంలోని ఐ5 కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఎం.వర్షిత్ వర్మ, మ్రోనల్‌రెడ్డి, బి.జోయెల్, బి.వర్షిత్ జయరామ్, బి.ప్రణీత్‌నాయక్ ప్రవేశపరీక్షలో ఉత్తమ మార్కులు సాధించడంతో సీట్లు లభించాయని డైరెక్టర్ రవివర్మ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన ఆదివారం అభినందించారు.

టీయూలో ముగిసిన క్రీడాపోటీలు

డిచ్‌పల్లి, మార్చి 31 : ఎన్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీయూలో నాలుగు రోజుల నుంచి కొనసాగుతున్న క్రీడాపోటీలు ముగిశాయి. ఆదివారం నిర్వహించిన టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వేణురాజ్ ప్రారంభించారు.

పురస్కారం అందుకుంటున్న మంచాల జ్ఞానేందర్

మంచాల జ్ఞానేందర్‌కు అయ్యప్ప సేవారత్న పురస్కారం

ఖలీల్‌వాడి, మార్చి 31 : నగరంలోని మంచాల శంకరయ్యగుప్తా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ అయ్యప్ప సేవారత్న పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీ అయ్యప్ప జయంతి ఐక్యవేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధీశ్వరులు అభినవ ఉద్దండ విద్యాశంకర్ భారతీ స్వామి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నందుకు ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

వేల్పూర్, మార్చి 31: మండలంలోని జాన్కంపేట్ పాఠశాలలో పీటీఎఫ్‌గా సుమారు 30 ఏండ్లు పనిచేసిన బట్టు పెద్దబాలయ్య ఇటీవల మృతి చెందగా జాన్కంపేట్ ఎస్సీ 88 సంఘం సభ్యులు ఆదివారం భీమ్‌గల్ మండలం చేంగల్‌లో బాలయ్య భార్యకు రూ.12వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తలారి శేఖర్, ఎస్.ప్రభాకర్, కిషన్‌రెడ్డి, ఎడ్ల సిరిల్‌రావు, రూపేశ్ పాల్గొన్నారు.

ఆర్యసమాజంలో గాయత్రీ మహాయాగం



యాగం నిర్వహిస్తున్న ఆర్యసమాజం ప్రతినిధులు

సుభాష్‌నగర్, మార్చి 31 : జిల్లాకేంద్రంలోని కస్బాగల్లీలో ఉన్న ఆర్యసమాజంలో మహర్షి దయానంద ద్విశాతాబ్ది ఉత్సవాల్లో భాగంగా 51 హోమ కుండళ్లతో గాయత్రీ మహాయాగాన్ని ఆదివారం నిర్వహించారు. గాయత్రీమాత మహా మంత్ర ప్రాశస్త్యం, హోమ ప్రాముఖ్యతను వివరించారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యసమాజ్ ప్రతినిధి ప్రొఫెసర్ విఠల్‌రావు, నీరజ మాతాజీ, ఆచార్య వేదమిత్ర ప్రణవ్‌కుమార్, ఆర్యసమాజం ఇందూరు అధ్యక్షుడు కరిపె సూర్యప్రకాశ్, కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యాధికారిగా రవికుమార్

ఖలీల్‌వాడి, మార్చి 31 : జిల్లా ఇంటర్ విద్యాధికారిగా రవికుమార్‌ను రాష్ట్ర విద్యా కమిషనర్ నియమించారు. వర్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఇంటర్ విద్యా మూల్యాంకన కేంద్రం అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రవికుమార్.. నేడు (సోమవారం) బాధ్యతలు చేపట్టనున్నారు.

సైబర్‌నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ధర్పల్లి, మార్చి 31 : సైబర్‌నేరాలతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. మండలకేంద్రంలోని కొత్తబస్టాండ్ ఆవరణలో పోలీసులు గ్రామస్తులతో ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు, ఏటీఎం వివరాలు అడిగితే చెప్పవద్దని అన్నారు. అనవసర లింక్‌లపై క్లిక్ చేయవద్దని, లక్కీడ్రాల పేరుతో ఫోన్ చేస్తే డబ్బులు పంపి మోసపోవద్దని సూచించారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మోహన్, రాంజీ, గోపి, గోవింద్ పాల్గొన్నారు.

చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్టు

వినాయక్‌నగర్, మార్చి 31 : జిల్లాకేంద్రంలోని ఫోర్త్ టౌన్‌పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం జరిగిన చైన్‌స్నాచింగ్ కేసును పోలీసులు 24 గంటల వ్యవధిలో ఛేదించారు. నగర సీఐ నరహరి పర్యవేక్షణలో ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. ఆటోలో వెళ్తున్న లక్ష్మి అనే ప్రయాణికురాలి మెడలో నుంచి పుస్తెలతాడును బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు తెంచుకొని పరారైన విషయం తెలిసిందే. నిందితులను ఆర్మూర్ పట్టణ పరిధిలోని పిప్రి గ్రామానికి చెందిన విఠల పరమేశ్వర్, అల్లరి ప్రశాంత్‌గా గుర్తించి పట్టుకున్నారు. వీరి నుంచి చోరీ చేసిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని, నేరానికి వినియోగించిన బైక్‌ను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు ఎస్సై సంజీవ్ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, మార్చి 31 : మండలంలోని సికింద్రాపూర్ గ్రామానికి చెందిన తలారి బుర్రన్న (42) ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఏఎస్సై సుశీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుర్రన్న బాల్‌నగర్ నుంచి తన స్కూటీపై సికింద్రాపూర్ గ్రామానికి వెళ్తుండగా బాల్‌నగర్ చౌరస్తా వద్ద వెనుకవైపు నుంచి వచ్చిన పడకల్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బుర్రన్న తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య రాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా రవి

జక్రాన్‌పల్లి, మార్చి 31 : కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా కనుక రవిని నియమించారు. ఈమేరకు రవికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదివారం నియామకపత్రాన్ని అందజేశారు.

దాసాంజనేయ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

భూమిపూజలో మంగళహారతులతో పాల్గొన్న మహిళలు

సారంగాపూర్, మార్చి 31 : నగర శివారులోని సారంగాపూర్‌లో నూతనంగా నిర్మించనున్న దాసాంజనేయ ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు ఆదివారం భూమిపూజ చేశారు. మహిళలు మంగళహారతులతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హోమం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

చేప @ 15కిలోలు

ఓ భారీ చేప ఆదివారం మత్స్యకారుడి వలకు చిక్కింది. కాస్లాబాద్‌కు చెందిన రామబోయి ఆదివారం ఉదయం గ్రామ చెరువులో చేపల వేటకు వెళ్లాడు. అతడి వలకు 15కిలోల బరువున్న చేప చిక్కింది. ఇప్పటివరకు ఇంతపెద్ద చేప దొరకలేదని అతడు తెలిపాడు. భారీ చేపను చూసేందుకు గ్రామస్తులు ఆసక్తి కనబర్చారు. అక్కడ ఉన్న వారు చేపను చేతిలో పట్టుకొని సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు.

-పెద్దకొడప్‌గల్, మార్చి 31